
# జిల్లాలు మారిస్తే గందరగోళమే

- ప్రజలకు మళ్లీ జిల్లా అధికారులు దూరం
- జిల్లా కేంద్రంలో తగ్గనున్న క్యాడర్‌స్ట్రెంత్
- ఉద్యోగుల పంపకాలు మళ్లీ మొదటికి
- ప్రక్రియ పూర్తి కావడానికి రెండేండ్లు
- అప్పటిదాకా నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులకు అన్యాయం
- ప్రభుత్వంలో తగ్గిపోనున్న ప్రజాప్రతినిధుల సంఖ్య
- అలంకారప్రాయంగా మారనున్న సమీకృత కలెక్టరేట్లు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపడతామని, వాటి సంఖ్యను తగ్గిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అటు నిపుణులను, ఇటు సామాన్యులను విస్మయానికి గురిచేస్తున్నాయి. పది జిల్లాలుగా ఉన్న తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్చోపచర్చలు, తర్జనభర్జనలు, ప్రజాభిప్రాయ స్వీకరణ అనంతరం 33 జిల్లాలుగా విస్తరించింది. కొత్త జిల్లాల కేంద్రంగా పాలన సవ్యంగా సాగుతున్నది. ఇప్పుడు మళ్లీ జిల్లాల సంఖ్యను కుదిస్తే కొత్త సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొత్త, చిన్న జిల్లాలతో ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువైందని, కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణ పెరిగిందని, ప్రజా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని చెప్తున్నారు. అన్ని శాఖలకు జిల్లా స్థాయి అధికారులు ఉండటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరుతున్నాయని అంటున్నారు. ఎస్పీ కార్యాలయాలు పెరగడంతో నేరాలు గణనీయంగా తగ్గాయని ఉదహరిస్తున్నారు. ఒకప్పుడు ప్రజలు జిల్లా అధికారులను కలవాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని, ఒకటి రెండు రోజులు సమయం వృథా అయ్యేదని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం 50-80 కిలోమీటర్ల దూరం లోనే జిల్లా కేంద్రం అందుబాటులోకి వచ్చిందని, ఒక్క రోజులోనే పని పూర్తవుతున్నదని చెప్తున్నారు.



### ఎందుకు.. ఏమిటి.. ఎలా?

జిల్లాల సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్నది నిపుణుల మొదటి ప్రశ్న. జిల్లా కేంద్రాలు అభివృద్ధికి చిహ్నాలని, విద్య, ఉద్యోగ, పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వీలు కలుగుతుందని చెప్తున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు జనాభా, జనసాంద్రత, భౌగోళిక విస్తీర్ణం, ఆ ప్రాంత ప్రజల జీవనశైలి, ప్రజల నుంచి వచ్చే డిమాండ్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటులో ఇలాంటి పద్ధతే పాటించారు. ఏపీలో ఇటీవల జరిగిన జిల్లాల పునర్విభజనలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేశారు. సీఎం ప్రతిపాదిస్తున్న పునర్విభజన లేదా పునరేకీకరణకు ప్రతిపాదిక ఏమిటనేది ఇంకా స్పష్టత రాలేదు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నదని, మరి అప్పుడు కూడా మళ్లీ కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

### జిల్లాలతో ముడిపడిన అంశాలు

- జిల్లాల ఏర్పాటుతో జోన్ల విభజన కూడా జరగాల్సి వస్తుంది. ఇవన్నీ అధికారికంగా అమల్లోకి రావాలంటే కేంద్రంతోపాటు రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి కనీసం ఒకటి రెండేండ్లు పడుతుంది. అప్పటివరకు ఎలాంటి నోటిఫికేషన్లు వేయడానికి ఆస్కారం ఉండదు. ఫలితంగా నిరుద్యోగులు నష్టపోతారు.
- ఇప్పటికే అన్ని జిల్లా కేంద్రాల్లో సమీకృత కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు నిర్మితమయ్యాయి. ఇతర అనుబంధ భవనాలు కూడా వచ్చాయి. జిల్లాల సంఖ్యను తగ్గిస్తే ఇవన్నీ వృథాగా మారిపోతాయి.
- కొత్త జిల్లాలతో జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, గ్రంథాలయ చైర్మన్ వంటి ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా పెరిగింది. అనుబంధంగా వచ్చిన జెడ్పీ సీఈవో, అన్ని విభాగాల్లో ఎస్ఈలు, ఇతర క్యాడర్ స్ట్రెంత్ మొత్తం రద్దు అవుతాయి.
- రాజకీయంగానూ జిల్లాల సంఖ్య తగ్గించడం పార్టీలకు ఇబ్బంది కలిగిస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు. జిల్లాల వారీగా పార్టీలు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, అనుబంధ కమిటీలు ఇలా వందలాది మందికి ప్రాతినిధ్యం కల్పించాయి. వారంతా ఇప్పుడు పదవులు కోల్పోయే అవకాశం ఉంటుంది.
- జిల్లాలు కేంద్రంగా ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు గందరగోళంలో పడతాయి. ఉదాహరణకు జిల్లాకో మెడికల్ కాలేజీ చివరి దశకు చేరింది. ఈ ఏడాది అనుమతులు వస్తే ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఏర్పడుతుంది. ఇప్పుడున్న జిల్లా దవాఖానలను మెడికల్ కాలేజీలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. వాటికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించారు. ఇలాంటి పథకాలు ఇప్పుడు గందరగోళంలో పడతాయని నిపుణులు చెప్తున్నారు. మొత్తంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఆలోచనతో ప్రయోజనం దాదాపు శూన్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం చేకూర్చినట్టవుతుందని ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

### ఎన్నో చిక్కులు

కొత్త జిల్లాల ఏర్పాటు లేదా జిల్లాల తగ్గింపు సులభం కాదని విశ్లేషకులు చెప్తున్నారు. ఉద్యోగుల సర్దుబాటు కష్టమవుతుందని స్పష్టం చేస్తున్నారు. జిల్లాల వారీగా ఉద్యోగుల విభజన పూర్తయిందని, క్యాడర్ స్ట్రెంత్ నిర్ణయం అయ్యిందని, కొత్త జిల్లాలతో మళ్లీ మొదటికి వస్తుందని అంటున్నారు. ఎన్ని జిల్లాలు తగ్గిస్తే.. అదే సంఖ్యలో కలెక్టర్ పోస్టులు, హెచ్‌వోడీలు, ఆయా కార్యాలయాల్లో పనిచేసే అటెండర్ల వరకు అన్ని పోస్టులు రద్దు అవుతాయని చెప్తున్నారు. ఫలితంగా ఉన్నతాధికారుల సంఖ్య భారీగా పడిపోతుందని, ఇప్పుడు పదోన్నతులు వేగంగా వస్తున్నాయని, జిల్లాల సంఖ్య తగ్గితే ఆలస్యం అవుతాయని వివరిస్తున్నారు.

## బీసీ పాలసీలు యథాతథంగా కొనసాగించాలి

- జాతీయ జనగణన వేదిక కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్



హైదరాబాద్, జనవరి7 (నమస్తే తెలంగాణ): బీసీల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని జనగణన వేదిక జాతీయ కన్వీనర్ గోసుల శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీబంధు పథకంతోపాటు పలు పథకాలను నిలిపేయాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నదని, ఇది సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. అర్హులైన బీసీలకు పథకాలు దరిచేరేలా మార్గదర్శకాలను పటిష్ఠం చేయాలని, పథకాలను మాత్రం రద్దు చేయొద్దని కోరారు. గొర్రెల పంపిణీ, బీసీ బంధు, చేనేత పథకాలను యథావిధిగా అమలు చేయాలని కోరారు.

## బీసీబంధు అమలు చేయాలి

- జాతీయ ఎంబీసీ సంఘాల కన్వీనర్ కొండూరు సత్యనారాయణ



హైదరాబాద్, జనవరి7 (నమస్తే తెలంగాణ): వృత్తిదారులకు అండనిచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీబంధు పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ సైతం యథావిధిగా కొనసాగించాలని జాతీయ ఎంబీసీ సంఘాల కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ బంధు కింద ఇప్పటికే అనేక మందిని ఎంపిక చేశారని, ఎన్నికల కోడ్‌తో చెక్కుల పంపిణీ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇతర వృత్తిదారులకు ఎంతో లబ్ధి చేకూరుతున్నదని, ముడిసరుకులు, యంత్ర పరికరాల కొనుగోలుకు చేయూతనిస్తుందని తెలిపారు. ఈ రాబోయే బడ్జెట్లలో ఎంబీసీ కార్పొరేషన్లకు భారీగా నిధులు కేటాయించాలని కోరారు.

## పోలీసులపై క్రమశిక్షణా చర్యలు

- పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్..
- తెలకపల్లి ఎస్సై, కానిస్టేబుల్ సస్పెన్షన్

బడంగ్‌పేట/తెలకపల్లి, జనవరి 7: పోలీసు అధికారులపై క్రమశిక్షణా చర్యలు మొదలయ్యాయి. భూవివాదంలో తలదూర్చినందుకు ఇన్‌స్పెక్టర్, లంచం డిమాండ్ చేసినందుకు ఎస్సై, కానిస్టేబుల్ సస్పెండ్ అయ్యారు. వివరాలు ఇలా.. భూవివాదంలో తలదూర్చినట్టు పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ కే సతీశ్‌పై ఫిర్యాదులు వచ్చాయి. విచారణ జరిపిన రాచకొండ సీపీ సుధీర్ బాబు.. ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ చేశారు. పోలీసులు భూ వివాదాల్లో తలదూర్చితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాగా గత నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం బొప్పల్లి గ్రామ సమీపంలో కొందరు పేకాట ఆడుతుండగా పోలీసులు ఆరుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు కాకుండా ఉండటానికి ఎస్సై లంచం డిమాండ్ చేశాడు. ఈ విషయమై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన ఎస్పీ వైభవ్‌గైక్వాడ్.. బాధ్యులైన ఎస్సై వస్త్రాంనాయక్, కానిస్టేబుల్ ఆంజనేయులును ఆదివారం సస్పెండ్ చేశారు.

## 12న టీ హబ్‌లో మ్యాపింగ్ వెబినార్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 7 (నమస్తే తెలంగాణ): మ్యాపింగ్ టెక్నాలజీని సమర్థంగా వినియోగించేందుకు టీ హబ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రత్యేక వెబినార్ నిర్వహించనున్నట్టు టీ హబ్ ప్రతినిధి తెలిపారు. 'ఓపెన్ మ్యాపింగ్ ఫర్ స్టార్టప్స్ అండ్ సోషల్ ఎంటర్‌ప్రైజెస్' అంశంపై జరిగే వెబినార్‌లో ఔత్సాహిక స్టార్టప్ వ్యవస్థాపకులతోపాటు సోషల్ ఎంటర్‌ప్రైజెస్‌ల నిర్వాహకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు, పేర్ల నమోదుకు ఈ కింది లింకు (https://meeting.zoho.com/meeting/register) లో సంప్రదించాలని సూచించారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 12.3°c | 32.1°c |
| రంగారెడ్డి | 15.0°c | 33.0°c |
| మెదక్ | 15.0°c | 32.6°c |
| నల్లగొండ | 17.0°c | 32.0°c |
| నిజామాబాద్ | 17.7°c | 29.7°c |
| వరంగల్ | 18.0°c | 29.0°c |
| కరీంనగర్ | 18.0°c | 29.0°c |
| హైదరాబాద్ | 18.0°c | 20.0°c |
| మహబూబ్‌నగర్ | 18.9°c | 30.6°c |
| ఖమ్మం | 19.0°c | 32.0°c |

# విదేశీ విద్యలో బీసీలకు కత్తెర?

మొదటిపేజీ తరువాయి...

ఇప్పటివరకు ఈ పథకం వర్తిస్తున్నది. ఇకపై ఎంపికచేసిన టాప్ 50 వర్సిటీల్లో సీట్లు వచ్చినవారికి మాత్రమే ఈ పథకం కింద ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని అధికారులకు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించినట్టు సమాచారం.

### ఇప్పటికి 2700 మందికి లబ్ధి

పేదింటి బీసీ బిడ్డలు విదేశాల్లో మాస్టర్స్, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల అభ్యాసానికి కేసీఆర్ ప్రభుత్వం జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏటా జనవరిలో (ఫాల్ సీజన్) 150 మంది, ఆగస్టులో (స్ప్రింగ్ సీజన్) 150 మందిని ఎంపికచేసి ఒక్కొక్కరికి రూ.20 లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తున్నది. వీసా, ప్రయాణ చార్జీలకు గరిష్ఠంగా రూ.50 వేలు అందజేస్తున్నది. ఈ పథకంలో 30 సీట్లను ఈబీసీలకు కేటాయించింది. ఇప్పటివరకు ఈ పథకం కింద దాదాపు 2700 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఇటీవల బీసీ సంక్షేమశాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించి ఈ పథకం అమలుపై ఆరా తీశారు. అ పథకానికి స్పెషల్ కేసులు (పైరవీలు) ఎక్కువగా నడుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పథకం అమలుకు నిర్దేశించిన మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని సూచించినట్టు తెలిసింది. ప్రస్తుతం తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు, అకడమిక్ మార్కులకు 60 శాతం, జీమ్యాట్/జీఆర్‌ఈ 20 శాతం, టోఫెల్, ఐలెట్స్, పీటీఈ పరీక్షల్లో వచ్చిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇచ్చి, ఆ మెరిట్ ఆధారంగా అర్హుల జాబితా సిద్ధంచేస్తున్నారు. అనంతరం సంబంధిత విభాగం అధికారులతోపాటు, ఉన్నత, సాంకేతిక విద్య, జేఎన్టీయూకు చెందిన సభ్యులతో ఏర్పాటైన స్టేట్ లెవల్ స్క్రీనింగ్ కమిటీకి ఆ జాబితాను పంపి అర్హులను ఎంపిక చేస్తున్నారు.

### టాప్ 50 యూనివర్సిటీలకే పరిమితం

ఇప్పటివరకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా దేశాల్లోని యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. అయితే ఎక్కువగా అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీ, టెక్సాస్ యూనివర్సిటీ, మిచిగాన్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, మిన్నెసోటా యూనివర్సిటీ, కెనడాలోని కాంకోర్డియ తదితర యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందుతున్నారు. ఇకపై అన్ని యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందినవారికి కాకుండా, విదేశాల్లోని టాప్ 50 యూనివర్సిటీల్లో చేరినవారికే బీసీ ఓవర్సీస్ పథకాన్ని వర్తింపచేసేలా నిబంధనలు రూపొందించాలని మంత్రి పొన్నం ఆదేశాలు జారీ చేశారు.

### కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ పథకానికి సంబంధించి ఫాల్ సీజన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతున్నది. ఫాల్‌సీజన్‌కు ఈ ఏడాది 2,665 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 2023 మంది బీసీ కులాలకు చెందినవారు కాగా, 642 మంది ఈబీసీ విద్యార్థులున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను డిసెంబర్ 15 నుంచి ప్రారంభించారు. జనవరి 23 వరకు ఇది కొనసాగనున్నది. అయితే పథకం మార్గదర్శకాల్లో మార్పులు చేస్తే ఆ కొత్త నిబంధనలను ఈ ఫాల్ సీజన్ నుంచే అమలు చేస్తారా? వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తారా? అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉన్నది.

# విదేశీ చదువుల్లో మార్పులివే..

- సంస్కరణపథంలో సాగుతున్న దేశాలు
- ఇమ్మిగ్రేషన్‌కు కొత్త నిబంధనలు
- అక్కడి విధానాలు తెలిస్తేనే గట్టెక్కేది

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : విదేశాల్లో చదువులు.. ఇప్పుడో ట్రెండ్. ఫారిన్ ఎడ్యుకేషన్ అంటేనే విద్యార్థులు ఊహాలోకంలో తేలియాడుతుంటారు. ముందు ఏదో ఓ కోర్సులో చేరాలి. కోర్సు పూర్తికాగానే మంచి ఉద్యోగం కొట్టేయాలి. డాలర్లు పౌండ్లు, యెన్‌లు సంపాదించాలన్న ఆశతో ఉంటారు. గ్లోబల్ ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్ స్టూడెంట్ మొబిలిటీ రిపోర్ట్-23 ప్రకారం 1.3 మిలియన్ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. కొత్తగా వెళుతున్నవారు లక్షల్లో ఉంటున్నారు. ఒకప్పుడు పోలోమంటూ అమెరికా బాటపట్టిన వారంతా ఇప్పుడు ఏదేశమైన పర్వాలేదనుకొంటున్నారు. ఈ ప్రయత్నంలో ఏ దేశమెళ్లాలి.. ఏం చదవాలన్న అన్వేషణ అతి ముఖ్యం. ఆయా దేశాల్లో అమల్లో ఉన్న ఇమ్మిగ్రేషన్ నిబంధనలన్నింటిపై అవగాహన కలిగి ఉండటం అత్యవసరం.



దీనికితోడు ఇటీవలికాలంలో ఇమ్మిగ్రేషన్, వీసా వంటి అనేక నిబంధనలు మారాయి.

### ఆస్ట్రేలియాలో

భారతీయ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఎంపికచేసుకొనే దేశాల్లో ఆస్ట్రేలియా ఒకటి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2022లో 1.09 లక్షల భారతీయ విద్యార్థులు ఆస్ట్రేలియాలో చదువుకొంటున్నారు. ఇటీవలికాలంలో వచ్చిన మార్పుల ప్రకారం ఐఈఎల్‌టీఎస్, టోఫెల్, డ్యూలింగో ఇంగ్లిష్ పరీక్షల్లో స్కోర్‌ను ఆస్ట్రేలియా పెంచింది. టెంపరరీ గ్రాడ్యుయేట్ వీసాకు ఐఈఎల్‌టీఎస్ స్కోర్ 6.0 నుంచి 6.5కు, స్టూడెంట్ వీసా స్కోర్‌ను 5.5 నుంచి 6.0కు పెంచారు. స్టూడెంట్ వీసా బ్యాంక్ డిపాజిట్ మొత్తం 24,505 డాలర్లు ఉంచాల్సి ఉంటుంది.

### కెనడాలో

భారతీయ విద్యార్థుల్లో కొందరు కెనడా బాట పడుతున్నారు. 2023 డిసెంబర్ 1 నుంచి పోస్ట్ సెకండరీ డిజిగ్నేటెడ్ లెర్నింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతి దరఖాస్తుదారు అంగీకార పత్రాన్ని నేరుగా ఐఆర్‌సీసీతో ధ్రువీకరించాలని కెనడా పేర్కొన్నది. ఇది ఇటీవలికాలంలో కెనడా విధించిన కొత్త తరహా నిబంధన. మోసాలను నివారించేందుకు అక్కడి ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. మార్కెట్‌కనుగుణంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ వీసాలను సమీక్షించాలని నిర్ణయించింది. విద్యార్థుల కనీస జీవన వ్యయాన్ని 10వేల కెనడియన్ డాలర్ల నుంచి 20,635 డాలర్లకు పెంచనున్నారు.

### యూకేలో

ఏటా 7.5లక్షల అంతర్జాతీయ విద్యార్థులు ఉన్నత చదువులకు యూకే పయనమవుతున్నారు. ఈ సంఖ్యను తగ్గించేందుకు యూకే ప్రభుత్వం పలు నిబంధనలు అమలుచేస్తున్నది. పీహెచ్‌డీ విద్యార్థులు తమ కుటుంబాలను యూకేకు తీసుకురావడంపై అక్కడి అధికారులు నిషేధం విధించారు. కొన్ని నెలల క్రితమే యూకే వీసా రుసుములను ఇండియన్ కరెన్సీలో రూ. 51,787 చెల్లించాల్సి వస్తున్నది.

### ఫ్రాన్స్‌లో

ఫ్రాన్స్‌లో మాస్టర్స్ విద్యార్థుల కోసం అక్కడి ప్రభుత్వం గతంలో స్పాన్సర్ చేసిన రెండేండ్ల పోస్ట్ స్టడీ వర్క్‌వీసాను ఇప్పుడు ఐదేండ్లకు పొడిగించింది. మాస్టర్స్‌కు మించి చదివిన వారికి ఐదేండ్ల షార్ట్ స్టే స్కెంజెన్ వీసాను పొందవచ్చు.

### ఐర్లాండ్‌లో

భారతీయ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఎంపికచేసుకొనే గమ్యస్థానాల్లో ఐర్లాండ్ ఒకటి. బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అంతర్జాతీయ విద్యార్థులు పోస్ట్ స్టడీ వర్క్ వీసా కోసం రెండేండ్లపాటు ఈ దేశంలో ఉండొచ్చు.

### ఇటలీలో

డిగ్రీ చదువు పూర్తయిన తర్వాత ఇటలీలో ఉండాలనుకొనే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. తాజా అంచనాల ప్రకారం 2022లో ఇటలీలో 5,897 మంది భారతీయ విద్యార్థులున్నారు. ఇటలియన్ లాంగ్వేజ్‌లో ప్రొఫెషనల్, ఇంటర్న్‌షిప్‌లు చేసుకొనే వెసులుబాటును కల్పించారు.

### న్యూజిల్యాండ్‌లో

ఇంటర్నేషల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్ (ఐఈఎల్‌టీఎస్) వన్ స్కిల్ రీటెక్ ఎంపికను అంగీకరిస్తున్నట్టు ఈ దేశం ఇటీవలే ప్రకటించింది. మొదటి ప్రయత్నంలో కోరుకొన్న స్కోర్ సాధించకుంటే వినడం, చదవడం, రాయడం, మాట్లాడడం ద్వారా స్కోర్‌ను మెరుగుపరుచుకోవచ్చు.

### అమెరికాలో

స్టూడెంట్ వీసా అపాయింట్‌మెంట్ సిస్టమ్‌లో మోసాలు, దుర్వినియోగాలను నిరోధించేందుకు విద్యార్థి వీసా దరఖాస్తుల్లో కొత్త నియామాన్ని అమెరికా ప్రకటించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఎఫ్, ఎం, జే స్టూడెంట్ వీసాల కోసం దరఖాస్తు చేసుకొనే వారు తమ ప్రొఫైల్‌ను రూపొందించి.. వీసా అపాయింట్‌మెంట్ షెడ్యూల్ సమయంలో సొంత పాస్‌పోర్ట్ సమాచారాన్ని వెల్లడించాలి. ప్రొఫైల్‌ను తప్పుగా నమోదుచేసినా, తప్పుడు పాస్‌పోర్టు నంబర్‌ను ఉపయోగించి బుక్ చేసుకొన్న అపాయింట్‌మెంట్‌ను కాన్సులేట్ అధికారులు రద్దుచేస్తారు. దీంతో వీసా రుసుమును కోల్పోతారు.

## గురుకులంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



స్వప్న (ఫైల్)

జహీరాబాద్, జనవరి 7: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన స్థానికంగా స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాలలోకి వెళ్లకుండా పోలీసులు ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామానికి చెందిన బ్యాగరి రాజు, వనజ దంపతుల కుమార్తె స్వప్న (17) రంజోల్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి చదువుకునేందుకు పుస్తకాల కోసం డార్మెటరీ గదికి వెళ్లింది. ఆ తరువాత స్వప్న చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన తోటి విద్యార్థినులు విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపారు. ఉపాధ్యాయులు వెంటనే గదిలోకి వెళ్లి విద్యార్థినిని కిందకు దింపి జహీరాబాద్ సర్కారు దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు విద్యార్థిని అప్పటికే మరణించినట్టు తెలిపారు. ఆ వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే మాణిక్‌రావు పాఠశాల వద్దకు రాగా.. లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### ట్రెయినీ ఇంజినీర్లు

ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్‌లో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 98
- పోస్టులు: ట్రెయినీ ఇంజినీర్, ట్రెయినీ ఆఫీసర్
- విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 22
- వెబ్‌సైట్: www.nhpcindia.com

### రీసెర్చ్ అసిస్టెంట్లు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 35
- పోస్టులు: రీసెర్చ్ అసిస్టెంట్, అసిస్టెంట్ డైరెక్టర్, ఎల్‌డీసీ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: ఫిబ్రవరి 5
- వెబ్‌సైట్: www.icssr.org

### ఎన్‌సీపీవోఆర్‌లో..

నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 3
- పోస్టులు: మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)
- అర్హతలు: పదో తరగతి లేదా ఐటీఐ ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 20
- వెబ్‌సైట్: https://onlineform.ncpor. res.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఎకానమీ (గ్రూప్స్), ఐఐటీ-నీట్ ఫౌండేషన్ కెమిస్ట్రీ, మ్యాథ్స్ (డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

## 'తల్లిదండ్రులకు' ఎగ్జామినర్ విధులొద్దు

- ఇంటర్ ప్రాక్టికల్స్‌పై బోర్డు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ ప్రాక్టికల్స్ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు కీలక ఆదేశాలు జారీచేసింది. సొంత పిల్లలు, దగ్గరి బంధువుల పిల్లలు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరయ్యే సమయంలో వారి తల్లిదండ్రులైన లెక్చరర్లను ఎగ్జామినర్ విధుల నుంచి మినహాయించాలని ఆదేశించింది. తమ వద్ద చదువుతున్న విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే చోట కూడా అలాంటివారిని ఎగ్జామినర్‌గా డ్యూటీ కేటాయించొద్దని పేర్కొన్నది. ఎగ్జామినర్ డ్యూటీ కేటాయించిన వారిని రిలీవ్ చేయని కాలేజీలపై రూ. 5వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఒకే యాజమాన్యం నిర్వహిస్తున్న కాలేజీల్లో మరో బ్రాంచి లెక్చరర్లను ఎగ్జామినర్‌గా విధులు కేటాయించడానికి వీల్లేదని స్పష్టంచేసింది.

## తగ్గనున్న 'పది' పుస్తకాల బరువు

- పుస్తకాల బరువు 3.5కిలోలకు కుదింపు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి వర్తింపు
- పేపర్ సైజు 70 జీఎస్‌ఎంకు తగ్గింపు
- ప్రభుత్వానికి విద్యాశాఖ ప్రతిపాదనలు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : వచ్చే విద్యాసంవత్సరంలో పదోతరగతి ఇంగ్లిష్ మీడియం పుస్తకాల బరువు తగ్గనున్నది. ప్రస్తుతం 4.5 కిలోలున్న ఈ పుస్తకాల బరువు 3.5 కిలోలు కానున్నది. ఇదే తరహాలో 1 నుంచి 10వ తరగతి పాఠ్యపుస్తకాల బరువు కిలో చొప్పున తగ్గనున్నది. ఈ ఏడాది పాఠ్యపుస్తకాల పేపర్ సైజును 90 జీఎస్‌ఎం (గ్రామ్స్ ఫర్ స్కేర్ మీటర్) నుంచి 70 జీఎంఎస్‌కు తగ్గించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ విషయమై ప్రభుత్వ అనుమతి కోరింది. ఆయా ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఇందుకు అనుమతించడం లాంఛనమే కానున్నది. కొత్తగా పుస్తకాలను 70 జీఎస్‌ఎం పేపర్‌తో ముద్రిస్తారు. దీంతో బడి సంచి బరువు 30 నుంచి 25శాతం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు.

### 3 వేల టన్నులు తగ్గనున్న భారం

పేపర్ సైజు కుదింపుతో కొనుగోలు చేయాల్సిన పేపర్ 3వేల టన్నులు తగ్గనున్నది. 90 జీఎస్‌ఎం పేపర్‌తో ఏటా 11,700 టన్నుల పేపర్‌ను విద్యాశాఖ సేకరిస్తున్నది. ప్రస్తుతం 70 జీఎస్‌ఎంకు తగ్గించడంతో 8 వేల టన్నులకు చేరనున్నది. బడ్జెట్ కూడా రూ. 30 కోట్ల నుంచి 40కోట్ల బడ్జెట్ తగ్గనున్నది. వచ్చే విద్యాసంవత్సరంలో 24.66 లక్షలు విద్యార్థులకు కోటికి పైగా ఉచిత పుస్తకాలు అందజేయాలని విద్యాశాఖ భావిస్తున్నది.



తరగతుల వారీగా అనుమతించిన బడి సంచి బరువు

| తరగతులు | కిలోలు |
|---|---|
| 1-2 | 1.5 |
| 3-5 | 2-3 |
| 6-7 | 4 |
| 8-9 | 4.5 |
| 10 | 5 |

## 'సాహితీ' వసూళ్లు 1164 కోట్లు

- మోసాలపై దర్యాప్తు ముమ్మరం
- జాయింట్ సీపీ రంగనాథ్ వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ఫ్రీలాంచ్ పేరిట ప్రజల నుంచి రూ.1164 కోట్లు వసూలు చేసిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఎండీ బూదాటి లక్ష్మీనారాయణ మోసాలపై దర్యాప్తు ముమ్మరం చేసినట్టు హైదరాబాద్ నగర క్రైమ్స్ అండ్ సిట్ విభాగం జాయింట్ సీపీ రంగనాథ్ తెలిపారు. 2022 ఆగస్టులో నగరానికి చెందిన యశ్వంత్‌తో పాటు మరో 240 మంది బాధితులు సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీపై ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం పలువురు బాధితులను పిలిచి వివరాలను వెల్లడించారు. డైరెక్టర్లు, 22 మంది మార్కెటింగ్ టీమ్‌తో కలిసి లక్ష్మీనారాయణ సుమారు 1752 మందిని మోసం చేసినట్టు విచారణలో తేలిందని జేసీపీ తెలిపారు. లక్ష్మీనారాయణ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో 'సాహితీ సర్వని ఎలైట్' పేరిట 32 అంతస్థులు, 10 టవర్లతో ప్రాజెక్ట్ ప్రారంభించాడని చెప్పారు. 2019-22 మధ్యకాలంలో పలువురి నుంచి రూ.504 కోట్లు తీసుకొని చేతులెత్తేసినట్టు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మొత్తం 9 ప్రాజెక్టుల పేరిట రూ.1164 కోట్లు వసూలు చేసినట్టు వివరించారు. నిందితుడిపై వివిధ ప్రాంతాల్లో మొత్తం 50 కేసులు నమోదై ఉన్నట్టు తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని 41 కేసులు ఉన్నట్టు చెప్పారు.



## పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

- వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



చిక్కడపల్లి, జనవరి7: పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం (నేడు) విద్య, ఉద్యోగ, ఆర్థిక సామాజిక రంగాల్లో మాదిగలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.